క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం రేవతి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం హెచ్‌ఎం సొంత ఖర్చుతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్ చంద్ర, నీలావతి పాల్గొన్నారు.

జోరందుకున్న గణేష్ విగ్రహాల విక్రయం

శాంతినగర్: గణేష్ విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. మరో రెండు రోజుల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా గ్రామాలు, పట్టణాలకు చెందిన ఉత్సవ కమిటీల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని రామాపురం రోడ్డులో గణనాథుడి విగ్రహాలు రూ.300 నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతున్నాయి. ఆకర్షణీయంగా ఉన్న విగ్రహాలను కొనుగోలు చేసేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే మండపాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

చేపపిల్లలు విడుదల



మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌లో శుక్రవారం చేపపిల్లలను వదిలారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 10లక్షలకుపైగా చేపపిల్లలను వదిలినట్లు మత్స్యకారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సువార్తమ్మ, మత్స్యకారులు లక్ష్మన్న, పరుశరాముడు, రాముడు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

గద్వాల క్రైం: ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడంపై గురువారం గద్వాల ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పేస్కేలు, టీఏ, డీఏలతోపాటు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పడం తగదన్నారు. కార్యక్రమంలో పరమేశ్వరయ్య, భాస్కర్, వెంకటయ్య, పుల్లయ్య, రాములు, నాగేశ్వరమ్మ, భవ్య, రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చాలీచాలని వేతనాలతో అవస్థలు

గద్వాల అర్బన్: 23ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నామని విద్యుత్ మీటర్ రీడర్స్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 110మంది విద్యుత్ మీటర్ రీడర్స్ కార్మికులు పని చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఆలయానికి విరాళం

మల్దకల్: మండల కేంద్రంలో వాల్మీకి ఆలయ నిర్మాణానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్దొడ్డి నల్లారెడ్డి రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతల సహకారం మరవలేనిదన్నారు. కార్యక్రమంలో మల్దకల్, నర్సింహులు, మునేప్ప, తిమ్మప్ప, రాముడు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

గద్వాల అర్బన్: గత ఎన్నికల్లో గద్వాల ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా కోరారు. శుక్రవారం ప్రగతి భవన్‌లో ఎంపీ అసదుద్దీన్ ఓవైసితో కలిసి మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుర్రంగడ్డ వంతెన, టెక్‌టైల్స్ పార్కు, ముస్లింలకు 12శాతం రిజర్వేషన్, ఈద్గా పనులు, షాదీఖానా తదితర హామీలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో ఎంఐఎం నాయకులు ఉన్నారు.

యువకుడికి గాయాలు

ధరూరు: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని జాంపల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని దోర్నాలకు చెందిన విజయ్ బైక్‌పై ధరూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, రాయిచూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తుమ్మిళ్ల మోటార్ బంద్?

- నేటి నుంచి నిలిపివేస్తున్నట్లు అధికారుల ప్రకటన
- తుంగభద్ర నదిలో నీటినిల్వ తగ్గడమే కారణం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



జూలెకల్ శివాలయం సమీపంలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీరు

శాంతినగర్: తుమ్మిళ్ల లిఫ్ట్ నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు సాగునీటి విడుదల ముణ్నాళ్ల ముచ్చటగా మారింది. రెండు రోజుల కిందట తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడంతో ఆర్డీఎస్ కెనాల్‌లో నీళ్లు ఐదడుగుల మేర ప్రవహిస్తున్నాయి. దిగువన ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు నీరందుతున్నాయి. తుంగభద్ర నదిలో నీటి నిల్వ తగ్గడంతో శనివారం నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు నీటి పంపింగ్ నిలిపివేయనున్నట్లు అధికారులు ప్రకటించడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. తుమ్మిళ్ల సమీపంలోని తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం కొంతమేర ఉండటంతో తాగునీటి అవసరాల కోసం విడుదల చేసినట్లు ఆర్డీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే కెనాల్ నిండుగా ప్రవహిస్తోంది.. ఇక నీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావించారు. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు చెప్పడంతో నిరాశకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతాలైన కర్నూలు జిల్లా, కర్నాటక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, టీబీ డ్యాంలో పూర్తిస్థాయిలో నీటిమట్టం లేకపోవడంతో ఇన్‌ఫ్లో తగ్గిపోయిందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

అగమ్యగోచరంగా రైతుల పరిస్థితి..

ఆర్డీఎస్ కెనాల్‌కు నీళ్లు వచ్చాయని సంతోషించాలో, లేక వెంటనే నిలిచిపోతాయని దుఃఖించాలో తెలియని పరిస్థితి ఆయకట్టు రైతుల్లో నెలకొంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆనకట్ట వద్ద నిలిచిన నీటి సరఫరా..

కర్నాటక పరిధిలోని రాజోళిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్) ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడం, టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో సాగునీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల కొంతమేర వర్షాలు కురవడంతో ఆర్డీఎస్ ఆనకట్టకు నీళ్లు చేరాయి. మళ్లీ వర్షాలు లేకపోవడంతో ఓవర్‌ఫ్లో అయిన నీరు తుంగభద్ర నదిలో ముందుకు వెళ్లడం, ఉన్న నీరు ఆర్డీఎస్ కెనాల్‌కు విడుదల చేయడంతో నీటి మట్టం పడిపోయింది. అంతేగాక కర్నాటక ప్రాంతంలో టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 105 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 66.345 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం చేరేవరకు ఆర్డీఎస్ కెనాల్‌కు నీటి విడుదల కష్టమేనని చెబుతున్నారు. కర్నాటక పరిధిలోని ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ప్రస్తుతం 5.6 అడుగుల మేర నీరు ఉండటంతో మరో రెండు, మూడు రోజుల్లో ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం నిలిచిపోతుందని పేర్కొంటున్నారు.

పోస్టల్ స్కీంలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఏఎస్పీ అజయ్‌సింగ్ చౌహాన్

ధరూరు: పోస్టల్‌శాఖ అమలు చేస్తున్న పథకాలతో ఆర్థికాభివృద్ధి, కుటుంబ సంక్షేమానికి ధోకా ఉండదని ఏఎస్పీ అజయ్‌సింగ్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పోస్టల్ స్కీంలు, వాటి ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోస్టల్ స్కీంలు ప్రతి కుటుంబానికి ఉపయోగపడేలా ఉంటాయన్నారు. రికరింగ్ డిపాజిట్, సేవింగ్ డిపాజిట్, మహిళా సమ్మాన్ అకౌంట్, టైం డిపాజిట్ అకౌంట్, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఇన్సూరెన్స్, ఆన్‌లైన్ ట్రాన్సక్షన్స్ కోసం ఫోన్ పే లాంటి ఐపీపీబీ అకౌంట్స్, రూ.396, రూ.399తో రూ.20లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 30మందికి సుకన్య యోజన పథకం అకౌంట్ల ప్రారంభానికి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి రూ.7,500 అందజేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్ పద్మమ్మ, బీపీఎం జయరామప్ప, సుధాకర్ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



జమ్ములమ్మ ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

గద్వాల: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు భోనంతో జమ్ములమ్మ ఆలయానికి పాదయాత్రగా చేరుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని జమ్ములమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జీహెచ్‌ఎంలు సంఘీభావం ప్రకటించారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ 20ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హుస్సేనప్ప, గోపాల్, జనార్దన్, ఖాజా, సమీ, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామాంజనేయులు, యువరాజు, నర్సింహ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరయ్య జయంతి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు

గద్వాల/గద్వాల అర్బన్: దివంగత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీజేపీ క్యాంప్ ఆవరణలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఆలోచనా తీరు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా జూరాల ప్రాజెక్టు సాంకేతిక అనుమతులు ఇతర సంక్లిష్ట నిర్మాణాలకు విశేష సేవలు అందించిన సత్యనారాయణసింగ్‌ను స్మరించుకున్నారు. అనంతరం విశ్వేశ్వరయ్య విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మురళీధర్, రమేష్, జయచంద్రారెడ్డి, వేణు పాల్గొన్నారు. అదేవిధంగా విశ్వేశ్వరయ్య హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

సజావుగా ‘టెట్’



శాంతినగర్‌లో టెట్ రాసేందుకు వచ్చిన అభ్యర్థులు


అయిజ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష శుక్రవారం సజావుగా సాగింది. మండల కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 240మంది చొప్పున 1,440మంది అభ్యర్థులు టెట్ రాశారు. పరీక్ష కేంద్రాలను అధికారులు పర్యవేక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

శాంతినగర్: టెట్ నిర్వహణకు వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. శాంతినగర్ ఉన్నత పాఠశాలలో 240మందికిగాను 218మంది, ఎల్‌ఎస్ఆర్ కళాశాలలో 240మందికిగాను 220, బోధిసి కళాశాలలో 240కి 218మంది, రాఘవేంద్ర కళాశాలలో 240మందికిగాను 218మంది, శివశివాని హైస్కూల్‌లో 240మందికిగాను 220మంది పరీక్ష రాశారు. మొత్తం 1200మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1096మంది హాజరయ్యారు. 104మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ జ్యోతి, ఎంఈఓ నర్సింహ, సీఎస్‌లు గోవిందరావు, ఆంజనేయులురెడ్డి, ఎంపీఈఓలు తిరుపతయ్య, పద్మావతి, ఖాజా, డీఓఎస్‌లు రాములు, అనితాబాయి, హేమలత, అరుణ్ రషీద్, మనోహర్‌రెడ్డి, సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ నరేష్ పర్యవేక్షించారు.

అభ్యర్థులకు భోజన వసతి

గద్వాల రూరల్: టెట్ రాసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. అదేవిధంగా మల్దకల్‌లో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం అందజేశారు. గట్టు మండలం మాచర్లకు చెందిన రైతు బోయ శాంతన్న ఇటీవల మృతి చెందగా, అతడి కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల రైతుబీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, సిద్ధి రామప్ప, వెంకటేష్, ఆనంద్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రావులపల్లి డీఏవీ స్కూల్ విద్యార్థులు

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల పదో తరగతి విద్యార్థి శ్రీకాంత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ శివనాయుడు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభకనబర్చినట్లు పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ రవిప్రకాష్, హెచ్‌ఎం నాగలక్ష్మి విద్యార్థిని అభినందించారు.

ధరూరు: రేవులపల్లి జెన్‌కో క్వార్టర్స్‌లోని డీఏవీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో అక్షయ్ కుమార్, వినూత్న, ప్రహర్ష, వైష్ణవి, శ్రీహర్ష, అనూష ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను జెన్‌కో ఎస్ఈ రామసుబ్బారెడ్డి అభినందించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

మల్దకల్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని నీలిపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించిన ప్రాజెక్టులతోనే రైతులకు సాగునీరు అందుతోందన్నారు. పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. అంతకుముందు నీలిపల్లి సర్పంచ్ ప్రకాష్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకులు 100మందికిపైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోవిందు, మల్దకల్ పాల్గొన్నారు.

ప్రోటోకాల్ కమిటీలో చోటు

గద్వాల అర్బన్: సీడబ్ల్యూసీ సమావేశాల ప్రోటోకాల్ కమిటీలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డికి చోటు దక్కింది. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు, విజయభేరి సభ విజయవంతం కోసం ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కమిటీలో గద్వాలకు చెందిన రాజీవ్‌రెడ్డికి స్థానం దక్కడంపై జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం వీడాలి

గట్టు: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంబించడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరసన దీక్ష శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షకు ఎంపీపీ విజయకుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామేలు, డేవిడ్, తిమ్మప్ప, జంబయ్య, నాగరాజు, రాజు, భీమన్న, తిమ్మప్ప, భాస్కర్, ఈదన్న, ఆమోస్, ఆదాం, యేసు, దావీదు, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీజేపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా ఇసాక్

గద్వాల రూరల్: బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మాలిమ్ ఇసాక్‌ను నియమించినట్లు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అప్సర్‌పాషా, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నమ్మకంతో ప్రార్థించాలి

ధరూరు: ప్రతి ఒక్కరూ నమ్మకంతో దేవుడిని ప్రార్థించాలని గుత్తి స్వస్థతశాల నిర్వాహకుడు రెవా అద్భుతకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గుత్తి చర్చి మైదానంలో ‘నీతి సూర్యుడి కలవద్దు దైవ సన్నిధి పండుగ’ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్‌ను బోధించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మణికుమారి, పాస్టర్ హనోక్‌రాజ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పచ్చర్ల రేణుక ఎల్లమ్మ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో సరస్వతీమాతకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి జన్మనక్షత్రం కావడంతో పంచామృతాభిషేకాలు, పడిపూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, ఆంజనేయశర్మ పాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని పచ్చర్ల రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర, మారుతి భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు.

పేదలకు అండగా ఉంటాం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పేదలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటోందని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి చెందిన భగవాన్‌జీరావు కుమారుడు ఉదయ్‌సాయి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2250లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం ఇతర కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే పేదలను సీఎం సహాయనిధితో అన్ని విధాలా ఆదుకుంటున్నట్లు తెలిపారు.

వాడీవేడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి



సమావేశ మందిరంలో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. వివిధ శాఖల అధికారులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రశ్నల వర్షం కురిపించారు. పీహెచ్‌సీలో గైనకాలజిస్ట్, చిన్నపిల్లల డాక్టర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే గొర్రెల కోసం లబ్ధిదారులు డీడీలు చెల్లించినా పంపిణీ చేయడంలేదన్నారు. గ్రామపంచాయతీ భవనాలు, బీటీరోడ్ల నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.10లక్షలను ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా నేరుగా సర్పంచ్‌లకు అందజేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మిషన్ భగీరథ పథకంతో ఇప్పటి వరకు భూంపురం గ్రామానికి తాగునీటి సరఫరా చేయకపోవడంపై సర్పంచ్, ఎంపీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయా శాఖల అధికారులు తెలిపారు.

బీజేపీ నాయకుల హల్‌చల్..

మండల సర్వసభ్య సమావేశ మందిరంలోకి బీజేపీ నాయకులు ఒక్కసారిగా దూసుకొచ్చి హల్‌చల్ చేశారు. పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించడంలేదని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రాజీనామా చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికార పార్టీ, బీజేపీ నాయకుల నినాదాలు మార్మోగాయి. అరగంట పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎంపీడీఓ సాయిప్రకాష్ బీజేపీ నాయకులకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధన్న, మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాగరాజు, వాణిజ్యసెల్ కన్వీనర్ ప్రతాప్‌గౌడ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు అంజి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

గద్వాల అర్బన్: అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అంగన్‌వాడీలకు రూ.26వేల కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలని, ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీతమ్మ, భువనేశ్వరి, నర్మద, ఫరీదా, లక్ష్మి పాల్గొన్నారు.

మతోన్మాదుల కుట్రలను తిప్పికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల అర్బన్: హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నించే మతోన్మాదుల కుట్రలను తిప్పికొడదామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం మతాల మధ్య చిచ్చు పెట్టడం హేయమైన చర్యన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వీవీ నర్సింహ, ఆంజనేయులు, బద్రి, కర్రెప్ప, సవారన్న ఉన్నారు.

చరిత్రను వక్రీకరించొద్దు : సీపీఐ

సాయుధ పోరాటంతో సంబంధం లేని పార్టీలు చరిత్రను వక్రీకరిస్తూ విమోచన దినం అంటూ జరుపుకోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వారంరోజుల పాటు సాయుధ పోరాట దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో సదస్సు, హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పెద్దబాబు, ఆశన్న, కాశీం, ప్రవీణ్, నరేష్, బుచ్చన్న ఉన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు

అలంపూర్: విద్యార్థుల జీవితాలతో పాలకులు చెలగాటం ఆడుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు ధ్వజమెత్తారు. అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు సీఎం సభకు బస్సులను తీసుకెళ్లి పాఠశాలలను బంద్ చేయడం సరికాదన్నారు. విద్యార్థులకు చదువును దూరం చేసి బస్సులను తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే సహించమన్నారు. సమావేశంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రభుదాసు, మైనార్టీసెల్ కన్వీనర్ షేక్ షాహిన్, వెంకటేశ్వర్లు, శివ, ఖాజా, వలీ ఉన్నారు.

పోలీస్‌ల అనుమతి తప్పనిసరి

ఎర్రవల్లిచౌరస్తా: గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్‌ల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ అశోక్‌బాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఉత్సవ కమిటీల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా డీజేల వినియోగానికి అనుమతి లేదన్నారు. మండపాల నిర్వాహకులు విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు.